క్లుప్తంగా

సీసీ రోడ్ల పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. శనివారం ఆరిమానుపెంట నుంచి కొట్బూరుగుట్లు అటవీ గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, స్థానిక సర్పంచ్ మల్లిక ప్రారంభించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. రోడ్డు నిర్మాణాలకు నిధులను కేటాయించిన ఎమ్మెల్సీ భరత్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, ఉప సర్పంచ్ పార్వతమ్మ, నేతలు గోవిందప్ప, చంద్రబాబు, శరవణ పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు



సదుం: దెబ్బతిన్న టమాటా పంట

సదుం: జోగివారిపల్లె పంచాయతీ అటవీ సరిహద్దు పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం రాత్రి బత్తలవారిపల్లె, మారుతివారిపల్లె పంట పొలాలపై ఏనుగులు దాడి చేశాయి. శనివారం రైతులు పొలాల వద్దకు వెళ్లి ధ్వంసమైన పంటలను చూసి దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. బత్తలవారిపల్లె, మారుతివారిపల్లెకు చెందిన లోకనాథ, మల్లికార్జున, రమేష్, రమణ, సుబ్రమణ్యంకు చెందిన టమాట, వరి పంటలు ఏనుగుల దాడిలో నాశనం అయ్యాయి.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

వి.కోట: పట్టణంలోని ఈశ్వర్‌నగర్‌కు చెందిన రామలక్ష్మి కుటుంబానికి సర్పంచ్ పీఎస్ లక్ష్మి శనివారం ఆర్థిక సాయం చేశారు. రామలక్ష్మి భర్త శ్రీనివాసులు (46) ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ దహన సంస్కారాల కోసం రూ.10,000 ఆర్థిక సాయం చేశారు. ఆమె తరఫున వార్డు మెంబరు కుమార్‌రాజా, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు శశికళ అందజేశారు.

కుక్కల దాడితో జింక మృతి



మృతి చెందిన జింక

కుప్పంరూరల్: కుప్పం మండలం గోనుగూరు గ్రామంలో శనివారం ఉదయం కుక్కల దాడిలో జింక మృతి చెందింది. వివరాలు ఇలా... అడవిలో నుంచి తప్పించుకుని గోనుగూరుకు చెందిన ఓ రైతు పొలంలోకి జింక వచ్చింది. దీన్ని గమనించిన కుక్కలు దాని వెంటపడ్డాయి. కొంత మంది యువకులు కుక్కల భారీ నుంచి కాపాడి గాయపడిన జింకను అటవీ అధికారులు అప్పగించారు. జింకకు వారు కుప్పంలో చికిత్సలు చేయించినా ప్రయోజనం లేకపోయింది. తీవ్రంగా గాయపడిన జింక గంట తరువాత మృత్యువాత పడింది. జింక కళేబరాన్ని ఇన్‌చార్జి రేంజర్ చంద్రశేఖర్, బీట్ ఆఫీసర్ రామకృష్ణ ఆధ్వర్యంలో దహనం చేశారు.

చెరువులో చిక్కిన 15 కేజీల చేప



బైరెడ్డిపల్లె : మండలంలోని మూలతిమ్మేపల్లె సమీపంలోని కోమిటివాని చెరువులో శనివారం 15 కేజీల చేప జాలర్లకు చిక్కింది. మండలంలోని చెరువుల్లో సాధారణంగా 2 నుంచి 5 కేజీల బరువున్న చేపలు ఉన్నాయి. కోమిటివాని చెరువులో 15 కేజీల చేప జాలర్లకు దొరకడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

బైక్ విన్యాసాలు.. డెత్ రేసులు



బైక్ విన్యాసంలో మృత్యువాతపడిన ఆదిల్‌బాషా (ఫైల్)

- గత నెల 19న పుంగనూరు బైపాస్ రోడ్డులో పలమనేరుకు చెందిన ఆదిల్‌బాషా (19) ద్విచక్రవాహనంలో వేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో యువకుడు కింద పడడంతో పాటు వాహనం నుంచి మంటలు చెలరేగి అక్కడికక్కడే సజీవదహనమైయ్యాడు.
- మండలంలోని చదళ్ల క్రాస్ వద్ద మదనపల్లెకు చెందిన శ్రీనివాసులు అనే యువకుడు బైక్ విన్యాసాలు చేస్తూ కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.
- పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో మైనర్ వాహనం నడిపిన ప్రమాదంలో గణేష్ అనే వ్యక్తి మృతి చెందాడు.
- సుగాలిమిట్ట వద్ద మస్తాన్ అనే యువకుడు, బైపాస్ క్రాస్ వద్ద శ్రీనివాసులు అనే యువకుడు, మిని బైపాస్‌రోడ్డులో ఫిరోజ్ అనే యువకుడు విన్యాసాలు చేసి తీవ్ర గాయాల పాలయ్యారు.

- ఇవి ఉదాహరణలు మాత్రమే. మరి కొన్ని వెలుగులోకి రావడం లేదు. పట్టణ బైపాస్ రోడ్డులో విన్యాసాలు.. బెట్టింగ్ రేసులు చేస్తూ తరచూ ప్రమాదాల బారిన పడి యువకులు క్షతగాత్రులు అవుతున్నారు. ఒక్కోసారి యువత విన్యాసాలతో దారిన వెళ్లే అమాయకులు గాయపడుతున్నారు. లైసెన్స్ లేని కొందరు..నిబంధనలు పాటించకుండా కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు.



ప్రమాదంలో సజీవదహనమైన యువకుడు ఆదిల్‌బాషా(ఫైల్)

- ద్విచక్ర వాహనాలతో యువత బెట్టింగ్ రేసులు
- చెవులు చిల్లులు పడేలా హారన్ల మోత
- లైసెన్స్ లేకుండానే వాహనాలు నడుపుతున్న మైనర్లు
- ప్రమాదాలబారిన పడుతున్న వైనం
- తల్లిదండ్రులకు తప్పని శోకం

పుంగనూరు: పట్టణంలో యువకుల మోటార్ బైక్‌ల అత్యుత్సాహం ప్రాణాలమీదికి తెస్తోంది. ద్విచక్ర వాహనాలను పైకి లేపి ఒక చక్రంతో ఎంత దూరం వెళతారాన్న దానిపై బెట్టింగ్‌లు సాగుతున్నాయి. పెద్దల అతి గారాబం కూడా పిల్లల ప్రాణాలను తీస్తోంది. పిల్లలు అడిగిన వెంటనే తల్లిదండ్రులు అతి ఖరీదైన, రేసు ద్విచక్ర వాహనాలను కొనిస్తున్నారు. అ వాహనాలతో యువకులు విన్యాసాలు చేస్తూ మృత్యువాత పడడం లేదా క్షతగాత్రులు అవుతుండడంతో తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. యువకులు రహదారులపై ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండ ద్విచక్రవాహనాలతో విన్యాసాలు చేస్తున్నారు. ముందు చక్రాన్ని పైకి లేపి వాహనం నడపడం, సెల్‌ఫోన్ బ్లూటూత్ పెట్టుకుని వాహనాలను మితిమీరిన వేగంగా నడుపుతున్నారు. బెట్టింగ్‌ల మోజులో యువకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి, విన్యాసాలు చేస్తూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగిలిస్తున్నారు. యువకులు విన్యాసాలు చేసే సమయంలో జరిగే ప్రమాదాల్లో రోడ్డుపై ప్రయాణిస్తున్న అమాయక ప్రజలు కూడ బలౌతున్నారు. పోలీసులు, రవాణాశాఖాధికారులు తక్షణమే చర్యలు తీసుకుని విన్యాసాలు చేసే యువతకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. తల్లిదండ్రులు కూడా వాహనాలు కొనిచ్చే ముందు పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోవాలని మేధావులు సూచిస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో అధికం

పుంగనూరు పట్టణంలోని కోర్టు బైపాస్‌రోడ్డు, కోర్టు రోడ్డు, తిరుపతి రోడ్డు, ఎంబీటీ రోడ్డు, బైపాస్‌రోడ్డు ప్రాంతాల్లో బైక్ విన్యాసాలు ఎక్కువగా ఉంటున్నాయి. యువకులు వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతూ భయంకరమైన హారన్లతో ప్రజలను హడలెత్తిస్తున్నారు. రోడ్లపై ముందు చక్రాలను పైకెత్తి నడుపుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ రహదారులపై వెళ్లే ప్రజలు ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని వేరే దారుల్లో వెళుతున్నారు.

రోడ్డెక్కుతున్న మైనర్లు

ద్విచక్ర వాహనాలను మైనర్లు ఎక్కువగా నడుపుతున్నారు. వీరికి రహదారిపై పట్టు లేకపోవడం, నిబంధనలపై అవగాహన లేక పోవడంతో మితిమీరిన వేగంగా వెళుతున్నారు. ముఖ్యంగా వీరికి డ్రైవింగ్ లైసెన్సులు ఉండడం లేదు. తల్లిదండ్రులు వాహనాలను తమ పేరున కొనుగోలు చేసి, పిల్లల సరదాల కోసం ఇస్తున్నారు. వారు ప్రమాదాలకు గురై చనిపోవడం లేదా ఇతరులను క్షతగాత్రులను చేస్తున్నారు. ఈ ఆయా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. మైనర్లు ప్రమాదం చేశారని తెలిసినా పోలీసులు పెద్ద వాహనాలపైనే కేసులు నమోదు చేస్తున్నారని డ్రైవర్లు లబోదిబోమంటున్నారు.

వాహన యజమానిపై కేసు



మైనర్లు నడుపుతూ ప్రమాదాలకు కారకులైతే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తాం. మైనర్లు విన్యాసాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, మఫ్టీ పోలీసులను నియమించి నిఘా వేస్తాం. బెట్టింగ్‌లు, విన్యాసాలు చేస్తుంటే వాహనాలను సీజ్ చేస్తాం . తల్లిదండ్రులు పిల్లలను పర్యవేక్షిస్తూ ఉండాలి. ఖరీదైన, రేసు వాహనాలను కొనిచ్చే ముందు బాగా ఆలోచించాలి.

– మధుసూదన్‌రెడ్డి, సీఐ, పుంగనూరు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అటవీశాఖ అధికారులు

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లెలో పర్యావరణ పరిరక్షణపై శనివారం అటవీ శాఖ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అటవీ సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. చెట్లను నరకడం మానవ మనుగడకు ముప్పు అని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ ధనంజయ, ఎఫ్‌బీఓలు యుగంధర్, మునిరాజ, ఏబీఓ వరదరాజులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగాధరం, మైనారిటీ కన్వీనర్ మస్తాన్, నేతలు రమణారెడ్డి, సూరి,ఇమ్రాన్ పాల్గొన్నారు.

మామిడి తూకాల్లో అక్రమాలను సహించం





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, హాజరైన హార్టీకల్చర్ అసిస్టెంట్లు

పలమనేరు: జిల్లాలోని మామిడి ర్యాంపుల వద్ద తూకాల్లో అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై చర్యలు తప్పవని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మామిడి కాయల వృద్ధి, కోతదశలో చేపట్టాల్సిన పద్ధతులపై శనివారం ఆర్‌డీవో కార్యాలయంలో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల పరిధిలోని ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 33 చోట్ల మామిడి ర్యాంపులున్నాయన్నారు. అక్కడి వ్యాపారులు రైతులకు తూకాల్లో మోసం చేయకుండా లీగల్ మెట్రాలజీ శాఖ నుంచి శిక్షణ పొందిన ఆర్‌బీకే సిబ్బంది పర్యవేక్షణలో మామిడి అమ్మకాలు సాగించాలని తెలిపారు. గిట్టుబాటు ధర రావాలంటే మామిడి రైతులు ఒకేసారి కాకుండా దఫ, దఫాలుగా మార్కెట్ ధరలను అనుసరించి కాయలను దిగుబడి చేసి అమ్మకాలు చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో మామిడి కాత తక్కువగా ఉన్న కారణంగా ధర ఎక్కువగా పలికే అవకాశం ఉందని తెలిపారు. స్థానిక హార్టికల్చర్ ఏడీ డాక్టర్ కోటేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, హెచ్‌వోలు లక్ష్మీ ప్రసూన, డింపుల్‌ప్రియ, ఎనిమిది మండలాల హార్టీకల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాలుగేళ్ల డిగ్రీ విధానంపై అవగాహన



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు నూతన డిగ్రీ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో ఓ మేజరు సబ్జెక్టు, ఓ మైనర్ సబ్జెక్ట్‌గా డిగ్రీ కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుందని తెలిపారు. బీఏ, బీకాం విద్యార్థులు ఇతర సబ్జెక్టులను, సైన్స్ విద్యార్థులు ఇతర అంశాలను తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇకపై డిగ్రీ కోర్సు మూడేళ్లు కాకుండా నాలుగేళ్లగా ఉంటుందన్నారు. నాలుగేళ్ల డిగ్రీ పూర్తి చేసిన వారు నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

బైరెడ్డిపల్లె : రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద మండల పరిధిలోని 9 సీహెచ్‌సీ గ్రూపులకు మంజూరైన ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా రైతు భరోసా కేంద్రాలతో స్థానికంగా రైతుల అన్ని అవసరాలు తీరుతున్నాయని పేర్కొన్నారు. ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, ఏఓ మునికృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి

పుంగనూరు: హనుమజ్జయంతి వేడుకలకు పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం నిర్వహించే వేడుకలకు గానూ పట్టణంలోని హనుమంతరాయునిదిన్నెలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం, కోనేటి వద్ద ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయం, సుబ్బమ్మ చెరువు మొరవ వద్ద ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయంతో పాటు అరవపల్లె శ్రీఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

పుంగనూరు: మండలంలోని ఏడూరు గ్రామం వద్ద వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని ముత్యాలు, నవరత్నాల దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ సంబరాలు

పెద్దపంజాణి: కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడంపై ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శనివారం రాయలపేటలో పార్టీ మండల అధ్యక్షుడు దొరస్వామి అధ్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు.

75 మందికి కంటి పరీక్షలు

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం చెన్నై శంకర నేత్రాలయ, సాయిమాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 75 మందికి కంటి పరీక్షలు చేశారు. 32 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వైద్యాధికారులు మురళీకృష్ణ, శ్రీనివాసులు, చంద్ర సేవలు అందించారు.

పాడి ఆవుల పెంపకంలో జాగ్రత్తలు

చౌడేపల్లె: వేసవిలో పాడి ఆవుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి పవన్ కుమార్ సూచించారు. శనివారం పరికిదొన పంచాయతీ దొనపల్లెలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. 285 పశువులకు వైద్య పరీక్షల అనంతరం బూటాక్స్ పిచికారీ చేశారు. వేసవిలో పాడి ఆవులు నీడ ప్రదేశంలో ఉండేలా చూడాలన్నారు. పాల దిగుబడి కోసం పచ్చిమేత తోపాటు పౌష్టికాహారం మేతగా వే యాలని సూచించారు. మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు పాల్గొన్నారు.

సమష్టి కృషితో కేసుల సత్వర పరిష్కారం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు, పక్కన న్యాయమూర్తులు కార్తీక్, సింధు

- లోక్ అదాలత్‌లో 296 కేసుల పరిష్కారం
- రూ.61.80 లక్షల పరిహారం
- న్యాయమూర్తి వాసుదేవరావు

పుంగనూరు: అధికారులకు, న్యాయవాదులు సహకరిస్తే పెండింగ్ కేసులు లోక్‌అదాలత్‌లో సత్వరం పరిష్కారమవుతాయని, ఇందుకు ఉదాహరణ శనివారం జరిగిన లోక్‌అదాలత్‌లో 296 కేసులు పరిష్కరించి, రూ.61.80 లక్షల పరిహారాన్ని అందించడమేనని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు తెలిపారు. శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్, అడిషినల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గల్లాశివశంకర్‌నాయుడుతో కలసి కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించి, అవార్డులు పంపిణీ చేశారు. న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ జాతీయ లీగల్ సర్వీసస్ అథారిటీ సూచనల మేరకు కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరిస్తామని తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించే కేసులపై అప్పీల్ ఉండదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మైత్రి సంబంధాలను కొనసాగించేందుకు లోక్‌అదాలత్‌ను ప్రతి ఒక్కరు వేదిక చేసుకోవాలని తెలిపారు. గ్రామ పెద్దలు, అధికారులు, న్యాయవాదులు తమ పరిధిలోని కేసుల్లోని వాది ,ప్రతివాదులను పిలిపించి పరిష్కరించేందుకు సహకరించాలన్నారు. అందరి సహకారంతో పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు వీలుంటుందని తెలిపారు. లోక్‌అదాలత్‌కు సహకరించిన న్యాయవాదులకు, అధికారులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆనందకుమార్, న్యాయవాదులు విజయకుమార్, బాలాజీకుమార్ , వెంకటముని యాదవ్, వెంకట్రామయ్యశెట్టి, ఆకుల చెన్నకేశవులు, వినోద్, వైఎస్.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్లనాటి ఆస్తి తగాదా రాజీ



కేసులను రాజీ చేస్తున్న న్యాయమూర్తులు

పలమనేరు: పట్టణంలోని కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో రూ. 67.77 లక్షల విలువైన 739 కేసులు పరిష్కారం అయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి రవి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. న్యాయమూర్తులు మాట్లాడుతూ 20 ఏళ్లనాటి అన్నదమ్ముల మధ్య ఆస్త పంపకాల తగాదా కేసు పరిష్కారం కావడం మంచి పరిణామని తెలిపారు. న్యాయవాదులు, పలమనేరు సబ్ డివిజన్‌లోని అధికారులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు రూ. 50 వేల విరాళం



విరాళం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కృష్ణమూర్తి

పలమనేరు: గ్రామ దేవత తిరుపతి గంగమ్మ ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి.జాతర నిర్వహణకు బైరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి రూ.50 వేలను ఆలయ కమిటీకి శనివారం అందజేశారు. గంగజాతరను పురస్కరించుకుని స్థానిక కమ్మ సంఘ నేతలు, న్యాయవాదులు, మాజీ మంత్రి అమరనాథరెడ్డి తదితరులు గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఆలయ చైర్మెన్ కండల నరేష్, సభ్యులు ప్రసాద్ రెడ్డి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీవేంకటేశ్వర కల్యాణం



సదుం: కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సదుం: మండలంలోని శ్రీవారి పాదక్షేత్రంలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం శ్రీశ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వర ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ మూర్తులను వైభవంగా ఊరేగించారు. అన్నదానం నిర్వహించారు.

వైభవంగా జ్యోతి మహోత్సవం



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

రొంపిచెర్ల: చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో శనివారం జ్యోతి మహోత్సం వైభవంగా జరిగింది. అర్చకులు మహేష్ శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం 9 గంటలకు ఆలయంలో జరిగిన హోమ పూజల్లో దంపతులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు. అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించి పుష్పపల్లకిలో ఊరేగించారు. ఇంటింటి వద్ద భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నూలు రెడ్డెప్ప, ప్రేమనందం, మోడెం వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

పలమనేరు: పట్టణంలో యూటీఎఫ్ నూతన కార్యాలయాన్ని శనివారం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సంఘం అభ్యున్నతికి కోసం ఎంతగానో కృషిచేసిన చెన్నుపాటి లక్ష్మయ్య, దాచూరి రామిరెడ్డి, అప్పారి వెంకటస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా సమస్యలను పరిష్కరిం చుకుంటూ మంచి సమాజాన్ని నెలకొల్పేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి చలపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీపీ ప్రకాష్, దీనావతి, జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, కృష్ణమూర్తి, ఏకాంబరం, మణిగండన్, రమణ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుల అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ చంద్రశేఖర్

పలమనేరు: ఇంటర్ బాలికను లోబర్చుకుని గర్భిణిని చేసిన వ్యక్తిని, అతని భార్యను శనివారం అరెస్ట్ చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితులు నాగరాజు, అతని భార్య నాగలక్ష్మి బాలికకు మాయమాటలు చెప్పి ఇంటికి పిలిపించుకుని లైంగిక దాడి చేసినట్టు విచారణలో తేలిందని పేర్కొన్నారు. వారు శనివారం పలమనేరు పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఉండగా, అరెస్టు చేశామని తెలిపారు.

వ్యక్తిత్వ వికాస తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న సురేష్‌బాబు

పలమనేరు: పట్టణంలోని వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో వ్యక్తిత్వ వికాస ఉచిత తరగతులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. సామాజికవేత్త యాదగిరి నిర్వహణలో ముద్దుకృష్ణ సౌజన్యంతో వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన ఇన్‌కం టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సురేష్ బాబు వ్యక్తిత్వ వికాసంపై పలు విషయాలను తెలిపారు. ఈ శిక్షణ జూన్ 2 వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు కృష్ణమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.